సాక్షి
వికారాబాద్
గురువారం । 29 । జూన్ । 2023



పనుల్లో పురోగతి ఏదీ..?

గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో జీపీలకు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసినా.. పనులు కదలడం లేదు. 8లో▸



సొంతింటి కల ఎప్పటికో?

పూడూరు మండల కేంద్రంలో పేదల సొంతింటి కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. 8లో▸



పుస్తకాల సమస్య తీరినట్టే!

ప్రభుత్వ పాఠశాలలకు ప్రతిసారి పాఠ్యపుస్తకాల పంపిణీ తలనొప్పిగా మారేది. ఈఏడాది సమస్య లేదు. 9లో▸

న్యూస్‌రీల్

బక్రీద్ శుభాకాంక్షలు



అనంతగిరి: త్యాగానికి ప్రతీక అయిన పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. జిల్లాలోని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక ప్రార్థనలకు పటిష్ట బందోబస్తు



చెన్‌గేష్‌పూర్ మార్గంలోని ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు టౌన్: చెన్‌గేష్‌పూర్ మార్గంలోని ఈద్గా మైదానాన్ని బుధవారం ఎస్పీ కోటిరెడ్డి పరిశీలించారు. ఈద్గా కమిటీ సభ్యులతో మాట్లాడి బక్రీద్ ప్రార్థనల ఏర్పాట్లపై ఆరా తీశారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలతో పాటు వందమందికి పైగా కానిస్టేబుళ్లు విధుల్లో ఉంటారని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఈద్గా కమిటీ సభ్యులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు



కలెక్టర్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే జూలై 6 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం డీపీఓకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి రూ.10 లక్షల బీమా ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను రూ.19,500 పెంచాలన్నారు. ఏటా మూడు జతల యూనిఫామ్‌లు పంపిణీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, శ్రీనివాస్, యాదయ్య, రమేష్, శివరాజ్, శాంతమ్మ, వెంకటమ్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు చదువే పరిష్కారం

జేడీ లక్ష్మీనారాయణ



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

నవాబుపేట: సకల సమస్యలకు చదువు ఒక్కటే పరిష్కార మార్గమని, అంకిత భావంతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో బుధవారం అక్షర చేయూత స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. లక్ష్యం లేకపోతే ఏదీ సాధించలేరన్నారు. చదువుతో పాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. అక్షర సేవా సంస్థకు తన వంతు సాయం రూ.1,16,000 ఇస్తున్నట్లు ప్రకటించాడు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ రూ.1లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆశారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, ఎంఈఓ గోపాల్, ఉపాధ్యాయులు శివకుమార్, శ్రీనివాస్, అంజయ్య, ఆనందం, సంజీవ్‌కుమార్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దరహాసం



కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు

జిల్లాలో 'కంటి వెలుగు' సంపూర్ణం

- 4,83,794 మందికి పరీక్షలు
- 42 బృందాలతో కొనసాగిన స్క్రీనింగ్
- కళ్లద్దాల పంపిణీలో రాష్ట్రంలోనే ప్రథమం
- 25శాతం మందికి అంధత్వ సమస్యలు
- 59,566 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు
- 64,792 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేత

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం పూర్తయ్యింది. వంద పని దినాల్లో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉండగా.. గడువులోపే ముగించి సర్కారు సంకల్పాన్ని విజయవంతం చేశారు. ఇందుకోసం వైద్య సిబ్బంది, అధికారులు ఎంతగానో శ్రమించారు. రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే కంటివెలుగు శిబిరాలు కొనసాగించారు. ఇదిలా ఉండగా అద్దాలు పంపిణీ చేసే విషయంలో మిగితా జిల్లాలతో పోలిస్తే వికారాబాద్ ముందు వరుసలో నిలిచింది. కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఇతర అధికారుల నిరంతర పర్యవేక్షణతో పరీక్షలు, చికిత్సలు, అద్దాల పంపిణీ పూర్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ వ్యక్తికి నేత్ర పరీక్షలు చేయాలని ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం జిల్లాలో త్వరగా పూర్తి కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పరీక్షలు.. అవగాహన

జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలు, 97 వార్డులు ఉన్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని 20 మండలాల్లో సుమారు 9.27 లక్షల జనాభా ఉంది. వీరందరికీ నేత్ర పరీక్షలు చేసేందుకు 42 వైద్య బృందాలను నియమించారు. ఓ పక్క కంటి వెలుగు స్క్రీనింగ్ చేస్తూనే.. మరో పక్క నేత్ర సమస్యల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో స్క్రీనింగ్ కేంద్రాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నవారిలో 25శాతం (1,24,364) మంది ఏదో ఒక కంటి సమస్యతో బాధ పడుతున్నట్లు తేలింది. ఇందులో కొందరికి రీడింగ్ గ్లాసెస్ అవసరమవగా మరి కొందరికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమని గుర్తించిన వైద్యులు వీటిని పంపిణీ చేశారు.

మనమే నంబర్ వన్

జిల్లాలో జనవరి 19న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో నిత్యం 42 బృందాలతో శిబిరాలు నిర్వహించారు. ఒక్కో క్యాంపులో నిత్యం 150 నుంచి 170 మందికి కళ్ల స్క్రీనింగ్ చేశారు. ప్రతీ శిబిరంలో వైద్యాధికారితో పాటు నేత్రవైద్యుడు, సిబ్బంది కలిపి ఎనిమిది మంది పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 9.27 లక్షల జనాభా ఉండగా.. ఇందులో 18 ఏళ్లు పైబడిన 4,83,794 మందికి నేత్ర పరీక్షలు పూర్తిచేశారు. వీరిలో 64,798 మందికి రీడింగ్ గ్లాసెస్ అవసరమని తేల్చి ఆరుగురు మినహా 64,792 మందికి అద్దాలు అందజేశారు. 59,566 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమని నిర్ధారించి.. ఇప్పటివరకు 50,235 మందికి అద్దాలు అందజేశారు. మిగిలిన వారికి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన అద్దాలను పంపిణీ చేయడంలో మన జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

సమష్టి కృషితోనే..



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తిచేశాం. పరీక్షలు నిర్వహించిన వారిలో తొంభైశాతం మందికి పైగా అద్దాలు పంపిణీ చేశాం. మిగిలిన వారికి త్వరలోనే అందజేస్తాం. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే కార్యక్రమం విజయవంతమైంది.

– పల్వాన్‌కుమార్, డీఎంహెచ్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బాల్యాన్ని బందీ కానీయొద్దు

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత
- బాల్య వివాహాల చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: బాల్య వివాహాల నివారణ చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జూలై మాసంలో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో బాల్యం చాలా గొప్పదన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లాలో జూలై 31లోపు అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, పిల్లల సంక్షేమ కమిటీ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలన్నారు. పిల్లలకు మంచి జీవితాన్ని అందించాల్సి వచ్చినప్పుడు కొంత కటువుగా వ్యవహరించాల్సి ఉంటుందని, ఈ విషయంలో అధికారులకు ఏదైనా సమస్య ఎదురైతే తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. తప్పిపోయిన పిల్లల విషయంలో చైల్డ్‌లైన్ ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జూలై 9న జరిగే సమావేశానికి గత విద్యా సంవత్సరంలో 9వ తరగతి చదివి పైచదువులకు వెళ్లని విద్యార్థినుల జాబితా సేకరించి తీసుకురావాలని డీఈఓను ఆదేశించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ చట్టం పరిధిలో పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రధాన పాత్ర పోషించాలని తెలిపారు. ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా సంబంధిత సెక్రటరీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్యాన్ని బందీ కానీయొద్దని.. బడీడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేలా చూడాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ రూపొందించిన పలు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ లలితకుమారి, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ పాల్వాన్ కుమార్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని జిల్లా కంటి వైద్యశాలలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన ఫాకో మిషన్ (కంటికి సంబంధించిన మిషన్)ను ప్రారంభించారు. వైద్యశాఖ మంత్రి హరీష్‌రావు వీడియో కాన్ఫరెన్స్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో 10 జిల్లాలకు మిషన్లు మంజూరవగా అందులో వికారాబాద్ ఒకటని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో ఓపీ, ఇతర వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్, కౌన్సిలర్లు సురేష్, అనంత్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు ముదిరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల మార్గంలో నడవాలి

- అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య, మంద కృష్ణమాదిగ
- లింగంపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: అంబేడ్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని లింగంపల్లిలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి అయిన అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. తాను అనుభవిస్తున్న ఎమ్మెల్యే పదవి ఆయన పెట్టిన భిక్షేనని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్, జగ్జీవన్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రొఫెసర్ కాశిం మాట్లాడుతూ.. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ దేశానికి రెండు కళ్లలాంటివారన్నారు. వీరి జీవిత పాఠాలు అందరికీ స్ఫూర్తిదాయకమని స్పష్టంచేశారు. అన్ని కష్టాలను వారు అనుభవించి మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ప్రసాదించిన మహానుభావులని కొనియాడారు. అందరూ ఆత్మగౌరవంతో బతికేందుకు చదువే ఏకైక సాధనమని చాటిచెప్పిన మహనీయులన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

దేశానికి అందరికన్నా ఎక్కువ సేవ చేసిన గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. స్వాతంత్రోద్యమంతో పాటు దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ప్రస్తుత రిజర్వేషన్లు ఆయన ఘనతేనని తెలిపారు. ఎమ్మార్పీస్ కేవలం రిజర్వేషన్ విభజన కోసమే పుట్టలేదన్నారు. ఆరోగ్యశ్రీ, సామాజిక పింఛన్ల పెరుగుదల ఉద్యమంలో తమది కీలక పాత్ర అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కడుమూరి ఆనందం,మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, సర్పంచులు సోలిసేట నర్సింలు, రత్నం,పర్మయ్య,రంగారెడ్డి, నాయకులు కళ్యాణ్‌రావ్, ఆనందం పాల్గొన్నారు.

యువత ఐక్యతకే క్రీడా పోటీలు

- ఎన్నికలకు ఆటలకు ఎలాంటి సంబంధం లేదు
- పీఎమ్మార్ ట్రస్ట్ సేవలను విస్తరిస్తాం
- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి
- తాండూరులో క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

తాండూరు టౌన్: యువతలో సమైక్యతా భావాలను పెంపొందించేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. పీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలకు, ఎన్నికలకు ఎలాంటిసంబంధం లేదని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలో సుమారు 6వేల మందితో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన తనయుడు రినీష్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్నం ఫ్యామిలీకి క్రీడా పోటీలు నిర్వహించడం కొత్తేమీ కాదన్నారు. పీఎమ్మార్ ట్రస్టు తరఫున తన తనయుడు రినీష్‌రెడ్డి నేతృత్వంలో సామాజిక కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని ప్రకటించారు. జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. వచ్చే సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో సామూహిక వివాహాలు జరిపించనున్నట్లు చెప్పారు.

యువత సన్మార్గంలో నడవాలి

అనంతరం ఎమ్మెల్సీ తనయుడు రినీష్‌రెడ్డి మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని, యువత తలుచుకుంటే సాధించనిదంటూ ఏదీ లేదని తెలిపారు. అలాంటి యువతను ప్రోత్సహించడంలో భాగంగానే పీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. తాను తక్కువ మాట్లాడుతూ.. ఎక్కువ పని చేసి చూపిస్తానన్నారు. యువత మత్తుకు బానిసలు కాకూడదని, తాండూరులో కొందరి వల్ల యువత పెడదోవ పడుతోందని తెలిపారు. యాగాలు, పూజలు జరిపించినంత మాత్రాన చేసిన తప్పులను దేవుడు క్షమించడని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో యువతకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. అనంతరం నియోజకవర్గ స్థాయి టోర్నీ విజేతలకు రూ.2 లక్షలు, రన్నరప్స్‌కు రూ.లక్ష అందజేశారు. పట్టణం, మండల స్థాయి విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.25 వేలతో పాటు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, బీఆర్‌ఎస్ నాయకులు కరణం పురుషోత్తంరావు, లక్ష్మారెడ్డి, డాక్టర్ సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, నర్సింహులు, రజాక్, రవిగౌడ్, పరిమళ, శోభారాణి, నీరజా బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, సిద్రాల శ్రీనివాస్,అజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, రినీష్‌రెడ్డి

నోటు పుస్తకాలేవి?

- స్కూళ్లు ప్రారంభమై 20 రోజులైనా పత్తాలేని ఉచిత నోట్‌బుక్స్
- రావాల్సినవి: 5,66,751
- వచ్చినవి: 60,700
- కొనాలా..? వద్దా..? తెలియని పరిస్థితి
- హోంవర్క్ చేసేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అవస్థలు
- త్వరగా పంపిణీ చేయాలని వినతి

తరగతి	విద్యార్థులు	తరగతి	విద్యార్థులు
1	9,490	6	8,767
2	10,352	7	9,468
3	8,391	8	8,568
4	9,841	9	8,802
5	9,385	10	8,430
మొత్తం	47,459	-	44,035



వికారాబాద్ అర్బన్: సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇస్తుండగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈసారి నోట్ బుక్స్ కూడా ఇస్తామని ప్రకటించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు. కానీ నోట్‌బుక్స్ అందజేతలో జరుగుతున్న జాప్యంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫ్రీగా ఇస్తారని చెప్పడంతో చాలా మంది పేద తల్లిదండ్రులు నోట్‌బుక్స్ కొనివ్వలేదు.

పదిశాతం మందికే..

స్కూళ్లు ప్రారంభమై దాదాపుగా 20 రోజులు కావస్తోంది. ఇప్పటివరకు పది శాతం మంది విద్యార్థులకు కూడా నోట్‌బుక్స్ అందలేదు. ప్రైవేటు పాఠశాలల మాదిరిగా 1నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి మూడు వర్క్ బుక్స్ (ఒకే పుస్తకంలో టెక్స్ట్ బుక్, నోట్‌బుక్) ఇస్తామని చెప్పారు. ఈ లెక్కన జిల్లాకు 1,42,377 నోటు పుస్తకాలు రావాలి. కానీ ఇప్పటి వరకు వీటి పత్తా లేదు. 6నుంచి 10వ తరగతి విద్యార్థులు కూడా నోట్‌బుక్స్ కోసం ఎదురు చూస్తున్నారు. తరగతుల ఆధారంగా ఎన్ని నోట్‌బుక్స్ ఇవ్వాలనేది నిర్ణయించారు. అధికారుల లెక్కల ప్రకారం 6నుంచి 10వ తరగతి వరకు 4,24,374 నోట్‌బుక్స్ అవసరం. ఇప్పటి వరకు 60,700 మాత్రమే వచ్చాయి. ప్రభుత్వం నోట్‌బుక్స్ ఇస్తుందా..? లేక ఎప్పటిలాగే మార్కెట్‌లో కొనుగోలు చేసి ఇవ్వాలా..? అనే విషయంలో తల్లిదండ్రులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. కొంతమంది కొనివ్వగా వారు హోం వర్క్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ నోట్‌బుక్స్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు వెనకబడిపోతున్నారు. 9, 10వ తరగతి విద్యార్థులు ఈ విషయంలో మరింత ఆందోళన చెందుతున్నారు.

91,494 వేల మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 91,494 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాశాఖ అధికారుల లెక్క ప్రకారం వీరికి 5.6 లక్షలకుపైగా నోట్‌బుక్స్ రావాలి. కానీ ఇప్పటివరకు కేవలం 60,700 మాత్రమే వచ్చాయి. మొదటి విడతగా 'మన ఊరు మనబడి' కింద ఎంపికైన 32 పాఠశాలల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యా దినోత్సవం రోజున నోటు పుస్తకాలు అందజేశారు. మిగిలిన స్కూళ్లలో ఎక్కడా ఇవ్వలేదు. పాఠాల బోధన వేగంగా సాగుతున్నప్పటికీ నోట్‌బుక్స్ లేకపోవడంతో హోం వర్క్ చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నోట్‌బుక్స్ త్వరగా ఇవ్వాలని కోరుతున్నారు.

త్వరగా ఇవ్వాలి



ప్రభుత్వం నోట్‌బుక్స్ ఉచితంగా ఇస్తుందని సార్లు చెప్పడంతో ఇప్పటి వరకు కొనుక్కోలేదు. కొందరు నోట్‌బుక్స్ తెచ్చుకున్నారు. కొనాలా వద్దా అనేది తెలుస్తలేదు. త్వరగా ఇస్తే అందరిలా నోట్స్ రాసుకోవడం, హోం వర్క్ చేసుకోడానికి వీలుంటుంది. నోట్‌బుక్స్ త్వరగా ఇవ్వాలి.

– శ్రవణ్‌కుమార్, 8వ తరగతి, మదన్‌పల్లి

రాగానే పంపిణీ చేస్తాం



ఇప్పటి వరకు వచ్చిన 60వేల పైచిలుకు నోట్ బుక్స్ పంపిణీ చేశాం. మిగతావి కూడా మరో మూడు నాలుగు రోజుల్లో రావచ్చు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇచ్చే వర్క్ బుక్స్ ప్రింటింగ్ కూడా పూర్తయినట్లు మాకు సమాచారం ఉంది. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక బక్రీద్


ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: త్యాగానికి ప్రతిరూపమైన పవిత్ర బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం తరువాత వచ్చే అతి ముఖ్యమైన పండుగ బక్రీద్ అన్నారు. ఈ పండుగ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ ముస్లింల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు.

విద్యార్థి బలవన్మరణం


నరేశ్ మృతదేహం

కడ్తాల్: మండలంలోని మైసిగండి గ్రామానికి చెందిన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మైసిగండికి చెందిన కేతావత్ నరేశ్(18) ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కాసేపటికి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న నరేశ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఏఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


వెంకటేశ్(ఫైల్)

కడ్తాల్: మండలంలోని శ్రీశైలం – హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్‌కు చెందిన వెంకటేశ్(25) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. కడ్తాల్ – ముచ్చర్ల గేట్ మధ్య ముందు వెళుతున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో టిప్పర్‌ను ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్‌ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

తల్లి, కొడుకు అదృశ్యం


సరస్వతి, శ్రీచరణ్(ఫైల్)

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ తన రెండేళ్ల కుమారుడితో కలిసి అదృశ్యమైన సంఘటన బుధవారం వెలుగుచూసింది. ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన సరస్వతిని, కడ్తాల్‌కు చెందిన ఎర్రోల బాల్‌రాజ్‌కు ఇచ్చి 2015లో వివాహం జరిపించారు. వీరికి రెండు సంవత్సరాల బాలుడు శ్రీచరణ్ ఉన్నాడు. ఈ నెల 24న తోటి కోడలు స్వప్నతో సరస్వతి గొడవ పడింది. దీంతో సరస్వతి తన కుమారుడు శ్రీచరణ్‌ను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త బాలరాజ్ భార్య, కుమారుడు కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పనుల్లో పురోగతి ఏదీ..?


కరన్‌కోట్‌లో అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకం


బెల్కటూర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

- ప్రతి గ్రామానికి రూ. 50లక్షల చొప్పున ఎస్‌డీఎఫ్
- కేవలం మూడు చోట్లే పనులు
- ఎమ్మెల్యే చొరవ చూపితేనే ఫలితాలు

తాండూరు రూరల్: గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రతి ఊరికి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, ఫార్మేషన్ రోడ్ల వేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. మండలంలో 33 గ్రామాలకు రూ. 50 లక్షల చొప్పున నిధులు ఇచ్చారు. మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్‌కు రూ. కోటి మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను ప్రజాప్రతినిధులు, నాయకులకు అందజేశారు.

కేవలం మూడు గ్రామాల్లో పనులు

మండలంలో ప్రతి ఊరికి నిధులు మంజూరు కాగా కేవలం మూడు గ్రామాలు గౌతపూర్, బిజ్వార్, బెల్కటూర్‌లో మాత్రమే పనులు జరుగుతున్నాయి.

కాంట్రాక్టర్లు దూరం

గతంలో ప్రభుత్వ పని అంటే కాంట్రాక్టర్లు ఉత్సాహంగా ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం ప్రతి ఊరికి రూ.50 లక్షలు నిధులు మంజూరైనా పనులు చేసేందుకు ససేమిరా అంటున్నారు. అప్పులు తెచ్చి పనులు చేస్తే బిల్లులు వస్తాయో లేదో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముంచుకొస్తున్న వర్షాకాలం

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఏ మాత్రం వర్షాలు పడినా పనులు చేసేందుకు అవకాశం ఉండదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి

ప్రతి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పనులు సక్రమంగా జరిగేలా చొరవ చూపాలి. చేసిన పనులకు బిల్లులు వస్తాయో లేదో అని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు ధైర్యం చెప్పి పనులు జరిగేలా చొరవ తీసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధులను సకాలంలో వినియోగించి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నాం. పనులు చేస్తే బిల్లులు వస్తాయని చెప్పాం. అయినా ఎవరూ ముందుకు రావడం లేదు. మరో సారి వారికి చెప్పి పనులు జరిగేలా చూస్తాం.

– నందిని, ఏఈ, పంచాయతీరాజ్ విభాగం, తాండూరు మండలం

ట్రాన్స్‌ఫార్మరే మృత్యుపాశమై..

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


నవీన్‌కుమార్‌రెడ్డి(ఫైల్)


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు, చిత్రంలో ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

బొంరాస్‌పేట: పొలం వద్ద పశువుల ఎరువు ట్రాక్టర్‌లో నింపడానికి విద్యుత్ తీగలు అడ్డుగా ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయడానికి వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని రేగడిమైలారంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన హన్మిరెడ్డి, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి(24), ఒక కూతురు ఉంది. నెల రోజుల క్రితం కుమార్తెకు వివాహం చేశారు. బుధవారం ఉదయం నవీన్‌కుమార్‌రెడ్డి పొలం వద్ద పశువుల ఎరువును తీసుకెళ్లడానికి ట్రాక్టర్‌తో వచ్చాడు. ఎరువు నింపేందుకు విద్యుత్ తీగలు అడ్డుగా ఉండడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయడానికి వెళ్లాడు. ఆఫ్ చేసే క్రమంలో షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన స్నేహితులు పరుగున వెళ్లి చూడగా.. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శంకర్ మృతదేహాన్ని పరిగి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. పెళ్లీడుకు వచ్చిన కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యంతమైంది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న లాల్‌కృష్ణ

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరుగుతోందని, బీసీలంటే బిచ్చగాళ్లు కాదని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం కేసీఆర్ బీసీలకు ఎర వేస్తున్నారని అన్నారు. గతంలో కూడా బీసీలకు రుణాలు ఇస్తాం అని చెప్పడంతో ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నారని, ఐదేళ్లు కావస్తున్నా రుణాలు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కుల వృత్తుల వారికి రూ. లక్ష సాయం చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, కేవలం 14 కులాలకు మాత్రమే సాయం చేయడం సరికాదన్నారు. బీసీల్లో చాలా కులాలు అట్టడుగు వర్గాలుగా ఉన్నాయన్నారు. బీసీలందరికీ లక్ష రూపాయల సాయం అందించాలని డిమాండ్ చేశారు. చట్ట సభలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు హన్మంతు ముదిరాజ్, చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆదిబట్ల అభివృద్ధి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమలు రాకతో ఆదిబట్ల మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇది సీఎం కేసీఆర్ చొరవతోనే సాధ్యమైందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా మంజూరైన రూ.5 కోట్లతో ఆదిబట్ల మున్సిపాలిటీలో సీసీ, బీటీ రోడ్ల పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.3.76 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే ఔటర్‌రింగ్ రోడ్డు లోపలి, వెలుపలి ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని పేర్కొన్నారు. అలాగే కొత్తగా వెలుస్తున్న ఫాక్స్‌కాన్ లాంటి అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ సంస్థలతో భూముల ధరలకు రెక్కలొచ్చాయని తెలిపారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో అనేక పరిశ్రమలు వస్తున్నట్లు వివరించారు. అనంతరం కొంగరకలాన్‌లో క్రీడా మైదానం కోసం టీఎస్ ఐఐసీ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్, వైస్ చైర్‌పర్సన్ కలమ్మ, కౌన్సిలర్లు ఎం మౌనిక, అర్చన, సంధ్య, ఎస్ మౌనిక, మహేందర్, శ్రీనివాస్, నాగేశ్, హరిదాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు జంగయ్య, నారాయణ, రవీందర్, జంగయ్య, ప్రవీణ్, రాజు, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఏఈ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం వరకు మెట్రో రైలును పొడిగించాలి

- మంత్రి కేటీఆర్‌కు విన్నపం


మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరవింద్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వరకు మెట్రో రైలును పొడిగించాలని మంత్రి కేటీఆర్‌కు విన్నవించినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు కర్నె అరవింద్ తెలిపారు. బుధవారం మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విన్నవించినట్లు చెప్పారు. ఎల్‌బీనగర్ వరకు ఉన్న మెట్రో రైలును ఇబ్రహీంపట్నం వరకు పొడగిస్తే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.

సొంతింటి కల ఎప్పటికో?

- పూడూరులో పిల్లర్ స్థాయి దాటని 'డబుల్' ఇళ్ల నిర్మాణం
- ఆశగా ఎదురు చూస్తున్న పేదలు


పూడూరులో పిల్లర్లకే పరిమితమైన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం

పూడూరు: మండల కేంద్రంలో పేదల సొంతింటి కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం. ప్రభుత్వం నిధులు కేటాయించినా కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు పునాదుల స్థాయిలోనే ఆగిపోయాయి. పూడూరు మండలానికి 50 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. పూడూరు, మన్నేగుడ, మీర్జాపూర్ గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. పూడూరులోని శ్మశానవాటిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు పిల్లర్లకే పనులు పరిమితమయ్యాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి 3,873 డబుల్ ఇళ్లు మంజూరయ్యాయి. సగానికిపైగా రోడ్లు భవనాల శాఖకు అప్పగించగా, మరి కొన్ని ఇరిగేషన్ శాఖ, మున్సిపాలిటీలకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా పూడూరులో 50 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పునాదుల పనులు పూర్తయి పిల్లర్ల స్థాయిలో ఆగిపోయాయి. పరిగి నియోజకవర్గానికి 680 ఇళ్లు మంజూరు కాగా పరిగి, దోమ, కులకచర్ల, గండ్వీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో డబుల్ ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరాయి. నిధులు లేని కారణంగానే కాంట్రాక్టర్ పనులు ఆపేసినట్లు తెలిసింది.

పనులు వేగవంతం చేస్తాం

పూడూరులో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. ప్రస్తుతం బిల్లులు వచ్చాయి. పనుల వేగం పెంచి త్వరలో పూర్తయ్యేలా చూస్తాం.

– మహేశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఊరెంట తండాలో ఎక్సైజ్ దాడులు

ఇద్దరికి తీవ్ర గాయాలు

ధారూరు: సారా తయారు చేస్తున్నారనే కారణంతో మండల పరిధిలోని ఊరెంట తండాలో ఎక్సైజ్ పోలీసులు బుధవారం మధ్యాహ్నం దాడి చేశారు. మఫ్టీలో ఉన్న అధికారులను గుర్తు పట్టని గిరిజనులు ఎదురుతిరిగారు. దీంతో పోలీసులు దాడిచేయగా శివరాంనాయక్, లోక్యానాయక్‌కు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

షాద్‌నగర్ జిల్లా సాధనకు ఉద్యమిద్దాం


జిల్లా సాధనపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఓ హోటల్‌లో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో తయారు చేయించిన పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కొంగరకొలాన్‌లో ఉన్న కలెక్టరేట్ కార్యాలయం సామాన్యులను అందుబాటులో లేదన్నారు. కలెక్టరేట్‌కు వెళ్లాలంటే సామాన్యులు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక వాహనం ఉంటే తప్ప కార్యాలయానికి వెళ్లలేమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త వీ గంగిరెడ్డి, పీ ప్రభాకర్, డీ శ్రీనివాస్, టీ నర్సయ్య, సీ వెంకటేష్, కే శివకుమార్, ఏ జగన్, రాజశేఖర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్‌చారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమ్మను చూడడానికి వెళ్తూ..


మధు మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న తల్లి, చిన్నమ్మ


సాగర్ రహదారిపై ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- మన్నెగూడ క్రాస్ రోడ్డులో ఘటన
- సాగర్ రోడ్డుపై బంధువుల రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్


మధు(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమ్మను చూడడానికి బాబాయ్‌తో కలసి బైక్‌పై వెళుతున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మన్నెగూడ క్రాస్ రోడ్డులో బైక్ యూటర్న్ తీసుకుంటుండగా లారీ ఢీకొంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదిబట్ల పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ గ్రామానికి చెందిన శ్రీశైలం, సంతోష దంపతులు. వీరికి ఒకే ఒక్క కుమారుడు మధు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇదే గ్రామంలో చిన్నమ్మ పద్మ, చిన్నాన్న బీరప్ప ఉంటారు. పొలానికి వెళ్లిన పద్మ అనారోగ్యానికి గురైంది. ఆమెను మన్నెగూడ సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించారు. సాయంత్రం 4గంటల సమయంలో భార్య పద్మను చూడడానికి బీరప్ప బైక్‌పై మన్నెగూడకు బయలు దేరాడు. ఈ సమయంలో అన్న కుమారుడు మధు కూడా చిన్నమ్మను చూడడానికి బీరప్ప వెంట వెళ్లాడు. బైక్ మన్నెగూడ క్రాస్‌రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఇబ్రహీంపట్నం వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న తల్లి, చిన్నమ్మ ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు.

సాగర్ రహదారిపై ఆందోళన

విద్యార్థి మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు సాగర్ రహదారిపై రాస్తారోకో చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి 8 గంటల వరకు ఆందోళన జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మన్నెగూడ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమా మహేశ్వర్‌రావు, ఆదిబట్ల పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

గీత కార్మికులకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


గీత కార్మికుడు జంగయ్య గౌడ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కల్లు గీత వృత్తిలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని మైసిపల్లికి చెందిన గీత కార్మికుడు జంగయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. ఆయన సహకారంతో బాధితుడికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం ఎమ్మెల్యే తన నివాసంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, చేతి వృత్తుల వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మైసిపల్లికి చెందిన అండాలుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.20 వేల విలువ చేసే చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచులు ఎల్‌ఎస్‌రెడ్డి, జంగయ్యగౌడ్, మార్కెట్ డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండారెడ్డిపల్లి శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం దొంతికుంట తండాకు చెందిన పాత్లావత్ రఘు(35)కు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పోచమ్మగడ్డ తండాకు చెందిన కవితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. మూడు నెలల క్రితం భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య కవిత పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు రోజుల క్రితం భర్త రఘు పోచమ్మగడ్డ తండాకు వెళ్లి భార్య కవితతో గొడవ పడ్డాడు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటికి వచ్చి కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.